పేదలపైనే ప్రతాపమా!

- వాణిజ్య కేంద్రాలుగా సెల్లార్లు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రాంగ్ పార్కింగ్ చేసిన కారుకు లాక్ వేసిన ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)


సెల్లార్‌కు తాళాలు ..



సెల్లార్‌లో నిర్వహిస్తున్న ద్విచక్రవాహనాల సర్వీస్ సెంటర్



సెల్లార్‌లో నిర్వహిస్తున్న వ్యాపారాలు

గోపాలపట్నం: ట్రాఫిక్ సమస్య పేరుతో పేదలు ఏర్పాటు చేసుకున్న చిన్న దుకాణాలు తొలగిస్తున్న అధికారులు పెద్దల జోలికి వెళ్లకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నా.. వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నా పట్టించుకోవడం లేదు. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు ఉన్న దుకాణాల్లో సెల్లార్లు పూర్తిగా వాణిజ్య అవసరాలకే వాడుతున్నారు. దుకాణ దారులు, భవన యజమానులు వాటిని అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. దీంతో వాహన చోదకులు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

అంతా వారి ఇష్టం

సెల్లార్లను పార్కింగ్‌కు వాడకుండా సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. గోపాలపట్నం పరిధిలో పలు దుకాణాల నిర్వాహకులు సెల్లార్లను పలు సంస్థలకు అద్దెలకు ఇచ్చేస్తున్నారు. మరి కొన్ని సెల్లార్లకు తాళాలు వేస్తుండడంతో రోడ్లపైనే వినియోగదారులు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని వస్త్ర దుకాణాల్లో టైలరింగ్‌కు, బుచ్చిరాజుపాలెంలో సెల్లార్‌లో సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. కార్లు పార్కింగ్ చేసినపుడు రోడ్డు సగం వరకు ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు కూడా వీటిపై దృష్టిసారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సర్వే ఏమైంది?

గతంలో ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. అనుమతులు ఉన్న భవనాలు ఎన్ని, లేనివి ఎన్ని అని పరిశీలించారు. వాటి ద్వారా సెల్లార్ల ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అకునున్నారు. అయితే ఆ తర్వాత ఇది మసకబారిపోయింది. ఆ సర్వేలో ఏం తేల్చారో కూడా వెల్లడించలేదు. దీంతో వ్యాపారులు తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.



వస్త్ర దుకాణం వద్ద తలుపులు వేసి ఉన్న సెల్లార్

స్పెషల్ డ్రైవ్ చేస్తాం



సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. సెల్లార్ల అనుమతులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. గతంలో సెల్లార్లపై సర్వే చేసి పలవురు దుకాణదారులకు నోటీసులు ఇచ్చాం. మరో మారు పరిశీలించి చర్యలు చేపడతాం. దీని కోసం త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపడతాం.

– రామలింగేశ్వరరెడ్డి, ఏసీపీ, జోన్–8 టౌన్ ప్లానింగ్

క్లుప్తంగా

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట


కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి సిబ్బంది

మల్కాపురం: ములగాడ హౌసింగ్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద 'స్వస్థ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి, మహిళల ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి మహిళకు ఆరోగ్యానికి సంబంధించిన అవసరమైన జాగ్రత్తలను వివరించినట్లు తెలిపారు.

క్లాత్ బ్యాగ్‌ల పంపిణీ


క్లాత్ బ్యాగ్‌లతో విద్యార్థులు, నిర్వాహకులు

మల్కాపురం: ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గ్రీన్‌క్లైమేట్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. 61వ వార్డు మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా నర్సింగ్ కళాశాలలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. జె.వి.రత్నం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినయోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయని వివరించారు. విద్యార్థులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

10 గంటల పని దినాన్ని ఉపసంహరించుకోవాలి



లేబర్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: ఎంతో మంది త్యాగాల ఫలితంగా సాధించుకున్న మే డే స్ఫూర్తితో దేశంలో ప్రతి ఒక్క కార్మికుడికి 8 గంటల పని దినాన్ని అమలు చేస్తే.., దాన్ని మార్చి 10 గంటల పని దినం చేయాలని రాష్ట్రంలో కూటమి సర్కారు చూస్తుందని సీఐటీయూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఆరోపించారు. 10గంటల పని దినం ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కూటమి సర్కారు ప్రతి కార్మికుడికి 10 గంటల పని దినం చేయాలని అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం దుర్మార్గమన్నారు. 8 గంటలు పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. శ్రమ దోపిడీకి గురి చేసే యత్నంలో చంద్రబాబు,పవన్‌కల్యాణ్ ఉండడం చాలా బాధాకరమన్నారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించలేని వీరికి పాలించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు,గంగాధర్,గంటా దాసు పాల్గొన్నారు.

ఏఎస్సార్ నగర్‌లో అంగీకార్ ర్యాలీ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లోని టిడ్కో గృహ లబ్ధిదారులకు సోమవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ అంగీకార్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జోన్–5 అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పుణ్యవతి మాట్లాడుతూ అర్బన్ హౌసింగ్ స్కీంలో పీఎంఏవై పథకంలో సొంత స్థలం ఉంటే.. రూ.2.50 లక్షల ఆర్థిక సాయం కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని, సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు గాను భారీ రాయితీని కూడా అందిస్తున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకం కింద 50 శాతం నుంచి 75 శాతం వరకు ఎంతైనా యూనిట్ సామర్థ్యాన్ని బట్టి రాయితీ ఇస్తారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రభ, విశాఖ సిటీ టెక్నికల్ టీం బిందు, దేవుడుబాబు, సీవో రమణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు జరగాలి


క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌పీ)లో అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు అన్ని వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. క్రాంతినగర్, సిద్ధేశ్వరం, పురుషోత్తపురం ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. క్యాన్సర్, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంలో ఎవరు నిర్లక్ష్యం చూపవద్దని, పరీక్షలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాతా, శిశు సేవలను కూడా చేయాలన్నారు. వైద్య శిబిరాల్లో అభ ఐడీ గుర్తించాలని, గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ వెంటనే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కోరారు. యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి. ఆదినారాయణ సోమవారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. జీతాలు పెండింగ్‌లో పెట్టినా, జీతాలు పూర్తిగా చెల్లించక పోయినా, సిబ్బందిని తగ్గించినా కార్మికులు అకుంఠిత కృషితో ఉత్పత్తి గణనీయంగా పెంచుతున్నారన్నారు. కార్మికుల కృషి వల్ల ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 2 మిలియన్ టన్నులు హాట్‌మెటల్ ఉత్పత్తి సాధించామన్నారు. ఈ ఏడాది కనీస బోనస్ రూ. 40,500లు చెల్లించాలని కోరారు.

62వ వార్డులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'


సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా : ఆరోగ్యకరమైన జీవనం కోసం పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని జీవీఎంసీ 62వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం తెలిపారు. ఈ మేరకు త్రినాథపురంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నాయకులు లక్ష్మి, కుమార్‌స్వామి హాజరయ్యారు. పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి, దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ సూర్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, సచివాలయ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

చల్లగ చూడమ్మా.. దుర్గమ్మా

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


ములగాడలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ లావణ్య


ఆర్టీసీ డిపో వద్ద దుర్గాదేవి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పలుచోట్ల దుర్గాదేవి మండపాలు ఏర్పాటు చేసి, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని చామంతి పూలతో అలంకరించి, ద్రాక్ష పండ్లు, పాల పాయసం వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు కోలాట నృత్యాలు, భజనలతో ఆకట్టుకున్నారు. 58వ వార్డు ములగాడలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, పార్టీ అధ్యక్షుడు కృష్ణ, గ్రామస్తులు దుర్గాదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీహరిపురం సామాజిక కార్యకర్త ముప్పిన ధర్మేంద్ర పూజలు నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ టీడీపీ నాయకుడు కోరాడ శ్రీను పూజల్లో పాల్గొన్నారు. ములగాడ హౌసింగ్ కాలనీ స్థానిక నాయకుడు రామ్మోహన్ నాయుడు పూజలు చేశారు. 59వ వార్డు కొత్త నక్కవానిపాలెంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు నక్క లక్ష్మణరావు యాదవ్ దుర్గాదేవి పూజలు జరిపారు. 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధిలలో డేరింగ్ డాషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో సీఐ గొలగాని అప్పారావు యాదవ్ పాల్గొన్నారు. అలాగే అల్లరి యూత్ ఆధ్వర్యంలోనూ పూజలు ఘనంగా జరిగాయి.


ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కరుణించు దుర్గమ్మా


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్‌లోని దుర్గామాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీవీఎల్ సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గొల్లకంచరపాలెం రామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు కలశ ప్రతిష్ఠ చేశారు. స్వర్ణ కవచ దుర్గాదేవికి భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు

గోపాలపట్నం: దేవి నవరాత్రి ఉత్సవాలు పలు ఆలయాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే, బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో మహిళలు కలశ పూజల్లో పాల్గొన్నారు. ఈ ఆలయాలతో పాటు నగరంలోని పలు ఇతర దేవాలయాల్లోనూ విశేష పూజలు జరిగాయి. గోపాలపట్నం నరసింహానగర్‌లో శంకరా సినిమా హాలు సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలోనూ తొలిరోజు పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు భవానీ మాల ధారణ చేశారు.


న్యూకాలనీ వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న కామేశ్వరరావు

వైభవోపేతంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

సింధియా : నియోజకవర్గంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అనేక ప్రాంతాల్లో దుర్గాదేవి మండపాలను ఏర్పాటు చేసి, అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడ అప్పన్నకాలనీ, అచ్చినాయుడులోవ వంటి ప్రాంతాలలో ఈ ఉత్సవాలు మరింత శోభాయమానంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా భవానీ భక్తులు తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.


62వ వార్డులో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్నభక్తులు


బుచ్చిరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయంలో కలశ పూజ చేస్తున్న భక్తులు


గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన మండపంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


విశేషాలంకరణలో దర్శనమిచ్చిన దుర్గా దేవి